క్లుప్తంగా

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: మాదిగల హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ పుట్టిందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మెల్యే చేత కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల ప్రజల హక్కులను కాపాడేందుకు ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గాంధీ, స్వాములు, ఏసేపు, బీసీ సంఘం నాయకులు కురుమూర్తి, టీడీపీ నాయకులు రాజన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

ఆత్మకూరు: మండలంలోని పెద్ద అనంతపురంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జిల్లా నాయకులు దేవ సహాయం, ముంతన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందాకృష్ణ మాదిగ 59వ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలుక రాబిన్సన్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి బాషా పోగుల దరగయ్య మాదిగ, జిల్లా కార్యదర్శి తప్పిట నాగేషులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బుజ్జి పాల్గొని పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వెలుగోడు: రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని అబ్దుల్లాపురం గ్రామంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం అబ్దుల్లాపురం గ్రామంలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో పొలాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అక్కడే వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భజన బృందం ఆధ్వర్యంలో భక్తి పాటలు, ఆరాధన చేశారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ జయరాజ్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా వర్షాలు కురవపోవడంతో జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కరువుఛాయలు అలుముకున్నాయన్నారు. సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో పనులు దొరకక వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమృద్ధిగా వర్షం కురిపించి, ఎండిపోయిన మా భూమిని పునరుద్ధరించాలని యేసు క్రీస్తును ప్రార్థించామని తెలిపారు.

మసీదుల్లో చోరీ

కొత్తపల్లి : మండలంలోని కొక్కెరంచ, ఎదురుపాడు గ్రామాలలోని మసీదులో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎదురుపాడు గ్రామంలోని మసీదులో గ్యాస్ సిలిండర్, రూ.15 వేలు విలువ చేసే నీళ్ల మోటార్‌ను ఎత్తుకెళ్లారు. అదేరోజు కొక్కెరంచ గ్రామంలోని మసీదులోని కానుకల పెట్టెలో ఉన్న సొమ్ము సుమారు రూ.6వేలు చోరీ చేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ మధ్యకాలంలో ఆయా గ్రామాల పరిధిలోని పొలాల్లో విద్యుత్ మోటార్లు, తీగలు కూడా చోరీకి గురైనట్లు ప్రజలు చెబుతున్నారు. పోలీసు అధికారులు వరుస దొంగతనాలపై దృష్టి సారించి దుండగులను పట్టుకోవాలని కోరుతున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

నందికొట్కూరు: ఈ నెల 3న ఇంటి మెట్లు ఎక్కుతూ కాలు జారీ కింద పడి గాయాల పాలైన పట్టణానికి చెందిన నీలిషికారి దూచి (46) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి చెన్నయ్య తెలిపారు. మృతుని భార్య 20 ఏళ్ల క్రితం చనిపోయింది. సంతానం లేదు. తండ్రి గణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

తప్పిన ప్రమాదం

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని దొరబావి వంతెన మలుపు దాటిన తర్వాత ఎగువ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఓ కారు అదుపు తప్పి కొండచరియను ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. తెలంగాణకు చెందిన కొందరు మహానంది నుంచి శ్రీశైలం వెళ్తుండగా మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి కొండచరియను కారు ఢీకొందని, అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. కారు డ్రైవర్ వేణుగోపాల్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందని, కారులో నలుగురు ఉన్నట్లు తెలిపారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తులసందడి కనిపించింది. సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. భక్తులు స్థానిక కాశిరెడ్డినాయన అన్నపూర్ణ ఆశ్రమం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

కరువుసీమలో జలసిరులు

- మహానేత వైఎస్సార్ చొరవతో ఆత్మకూరు డివిజన్‌లో 5 ఎత్తిపోతల పథకాలు
- నాటి మెట్ట భూముల్లో నేడు సిరుల పంటలు
- రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి
- నేడు మహానేత జయంతి
- వైఎస్సార్ స్మృతివనంలో నివాళులర్పించనున్న ప్రజాప్రతినిధులు, అన్నదాతలు



నల్లకాల్వలోని వైఎస్సార్ స్మృతివనంలో ఏర్పాటు చేసిన భారీ వైఎస్సార్ విగ్రహం



సిద్ధాపురం చెరువు (ఫైల్)



చెరువు కింద కళకళలాడుతున్న వరి పంట(ఫైల్)

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం
సాగు నీరు అందుతున్న గ్రామాలు : సిద్ధాపురం , సిద్ధపల్లి, ముష్టపల్లి, కరివేన, నల్లకాల్వ, బాపనంతపురం, కొత్తరామాపురం, బానుముక్కల, ఎర్రగూడూరు.
సాగు విస్తీర్ణం: ఆత్మకూరు, పాములపాడు మండలాల్లోని దాదాపు 10 గ్రామాల్లో 21 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుంది. పంట కాల్వ పూర్తయితే పూర్తి స్థాయిలో ఈ పథకం ద్వారా రైతులకు మరింత సాగు నీరు అందుతుంది.

చెలిమెల్ల ఎత్తిపోతల పథకం
సాగు నీరు అందుతున్న గ్రామాలు: చెలిమెల్ల, దుద్యాల, ఇస్కాల
సాగు విస్తీర్ణం : ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లోని పై గ్రామాల్లో 2 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుంది. ఈ ప్రాంతం అంతా మెట్టభూములు, నేడు సిరుల పంటలు కురుస్తున్నాయి.

లింగాల ఎత్తిపోతల పథకం
సారు నీరు అందుతున్న గ్రామాలు: లింగాల, నాగంపల్లి, కొక్కెరంచ, లింగాపురం
సాగువిస్తీర్ణం: 4 వేల ఎకరాల్లో సాగు నీరు అందుతుంది.

శివపురం ఎత్తిపోతల పథకం:
సారు నీరు అందుతున్న గ్రామాలు: శివపురం, ముసలిమడుగు, చిన్నగుమ్మడపురం, సింగరాజుపల్లి
సాగు విస్తీర్ణం: ఈ పథకం ద్వారా 3 వేల ఎకరాలకు నీరు అందుతుంది.

ఇస్కాల ఎత్తిపోతల పథకం
సాగునీరు అందుతున్న గ్రామాలు: ఇస్కాల , దుద్యాల, కరివేన
సాగు విస్తీర్ణం: 2,000 ఎకరాలకు నీరు అందుతుంది.

ఆత్మకూరు: ఒకప్పుడు ఆత్మకూరు డివిజన్ పరిధిలో కరువుకాటకాలతో వ్యవసాయం భారమై రైతన్నలు అప్పుల పాలై వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆత్మకూరు డివిజన్‌లో పలు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేశారు. దీంతో కరువుసీమలోని మెట్ట భూముల్లో నేడు సిరులపంటలు పండుతున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతుల హృదయాల్లో మహానేత వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారు.

ఒకే రోజు ఐదు ఎత్తిపోతల పథకాలకు భూమిపూజ ..

గతంలో కరువు వల్ల ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల రైతులు గుంటూరు, విజయవాడ, మార్కాపురం, దోర్నాల లాంటి ప్రాంతాలకు వలసలు వెళ్లి దినసరి కూలీలుగా జీవించేవారు. ఆర్థికంగా చితికిపోయిన రైతన్నల దీనస్థితిని చూసిన వైఎస్సార్ జలయజ్ఞం కింద ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఒకే సారి లింగాల, ఇస్కాల, చెలిమెల్ల, సిద్ధాపురం, శివపురం ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసి ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతన్నల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో 2006లో జరిగిన జలయజ్ఞం కార్యక్రమంలో ఈ ఎత్తిపోతల పథకాలకు భూమిపూజ చేశారు. వాటితో నేడు రైతులు సిరుల పంటలు పండిస్తున్నారు. ఆయా ఎత్తిపోతల పథకాల నీటితో దాదాపు 30 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. మహానేత మంజూరు చేసిన ఎత్తిపోతల పథకాలతోనే నేడు సంతోషంగా ఉన్నామని రైతులు గర్వంగా చెప్పుకుంటున్నారు.

నేడు రెండు పంటలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పథకం కింద మంజూరు చేసిన ఎత్తిపోతల పథకాలతో ఒక్క పంట కూడా పండించలేని రైతన్నలు నేడు రెండు కార్ల పంటలు పండిస్తున్నారు. ఎత్తిపోతల పథకాలు పూర్తి స్థాయిలో పనిచేస్తే ఈ ప్రాంతంలో కరువు ఛాయలు కనిపించే అవకాశం లేదు.

ప్రతి ఏటా వైఎస్సార్‌కు నివాళి..

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయడంతో అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన మరణానంతరం నల్లకాల్వ వైఎస్సార్ స్మృతి వనంలో వైఎస్సార్ జయంతి, వర్ధంతి సందర్భంగా ఈ ప్రాంత నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులర్పిస్తారు. సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా అన్నదాతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించనున్నారు.

ఎత్తిపోతల పథకాలు లేకపోతే కరువే



ఈ ప్రాంతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలు మంజూరు చెయ్యకపోయివుంటే కరువు, కాటకాలు తప్పేవి కావు. ఏటా వలసలు వెళ్లి జీవించాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం వైఎస్సార్ ఆశీస్సులతో పంటలకు సాగు నీరు అందుతున్నాయి. మా గ్రామానికి చెందిన సిద్ధాపురం ఎత్తిపోతల పథకంతో పాటు ఆత్మకూరు డివిజన్‌లోని ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసిన ఘనత మహానేత వైఎస్సార్‌దే. – విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్ధాపురం

రెండు పంటలు పండిస్తున్నాం



సిద్ధాపురం చెరువు కింద గత రెండు సంవత్సరాల నుంచి రెండు పంటలు పండిస్తున్నాం. ఎత్తిపోతల పథకం మంజూరు కాకపోయుంటే కరువు కాటకాలతో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం ఎత్తిపోతల పథకంతో సిద్ధాపురం చెరువులో పూర్తి స్థాయిలో నీరు ఉంది. ఈ నీటితో రెండవ పంట కూడా పుష్కలంగా పండుతుంది. ఈ పథకం మంజూరు చేసిన దివంగత నేత వైఎస్సార్ మా గుండెల్లో నిలిచి పోయారు. – శివశంకర్‌నాయక్, ఎస్.ఎన్.తండా

మెట్ట భూములు సస్యశ్యామలం



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం

నందికొట్కూరు: నియోజకవర్గంలో మల్యాల, ముచ్చుమర్రి, నాగటూరు ఫేస్–1, ఫేస్–2, తాటిపాడు, ఇస్కాల, చెల్లిమిల, లింగాల, శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అపర భగీరథుడిగా ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచారు. ఎడారి ప్రాంతాలకు, మెట్ట భూములు సస్యశ్యామలంగా వైఎస్సార్ పుణ్యాన మారిపోయాయి. మల్యాల ఎత్తిపోతల పథకంతో రాయలసీమను రత్నాల సీమగా మార్చి చరిత్రలో నిలిచారు. గతంలో పోత్తిరెడ్డిపాడు నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తరలించేవీలుండేది. వైఎస్సార్ పాలనలో పోత్తిరెడ్డిపాడును విస్తరించి 40 వేల క్యూసెక్కుల నీటిని తరలించి సీమ రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించారు.



మల్యాల ఎత్తినపోతల పథకం

మహానందీశ్వరుడి సన్నిధిలో జిల్లా కలెక్టర్



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి



కలెక్టర్ రాజకుమారిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధాని

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దంపతులు పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, వేదపండితులు రవిశంకర అవధాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. దర్శనం అనంతరం అలంకార మండపంలో కలెక్టర్ దంపతులకు వేద పండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

నూతన కలెక్టర్‌కు మహానందీశ్వరుడి ప్రసాదాలు

నంద్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతగా స్వీకరించిన రాజకుమారి గణియాకు ఆదివారం వేదపండితులు మహానందీశ్వరుడి ఆశీస్సులు అందించారు. ఏఈఓ ఎర్రమల మధు, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర శర్మ, హనుమంతశర్మ, రఘుశర్మలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి గణియాను కలిసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా ఆమోదింపజేసుకున్న మూడు క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్‌హాల్‌లో సీపీఎం పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలు ప్రజలకు హానికరంగా మారే అవకాశం ఉందన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నికల్లో రాజకీయంగా నైతికంగా దెబ్బతిన్న ప్రధాని మోదీ గత పార్లమెంట్‌లో 146 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి ఏకపక్షంగా ఈ చట్టాలను ఆమోదింపజేసుకున్నారన్నారు. సమావేశంలో సీపీఎం పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, షేక్ ఇస్మాయిల్, సద్దాంహుసేన్, నాయకులు భాస్కర్, పాలశివుడు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల మేనిఫెస్టో అమలు చేయాలి

ఆత్మకూరు: బీసీల సంక్షేమానికి టీడీపీ తీసుకొచ్చిన మేనిఫెస్టో అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామ్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి బాలస్వామియాదవ్ డిమాండ్ చేశారు. ఆత్మకూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ కమిటీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నామినేటెడ్ పదవులు బీసీలకు అధిక శాతం కేటాయించాలని, 50 ఏళ్లకే పింఛన్ పథకాన్ని త్వరగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వీరన్న, శ్రీహరి, రమణ, పెద్దనాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డె ఓబన్న సేవాసమితి కార్యాలయం ప్రారంభం



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో ఒడ్డె ఓబన్న సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు

ఆత్మకూరు: అఖిల భారత ఒడ్డె ఓబన్న సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాల నరసింహులు ఆదివారం ఆత్మకూరులో నూతన కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆత్మకూరు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. టౌన్ కమిటీ అధ్యక్షుడిగా చంద్రగిరి మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా చల్లా సుబ్బయ్య, గుంజి వెంకటరమణ, గుంజి రాజు, చంద్రగిరి దుర్గారాజు, ప్రధాన కార్యదర్శిగా గుంజి నాగరాజు, ట్రెజరర్‌గా సంపంగి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వల్లెపు మల్లికార్జున, సోషల్ మీడియా కార్యదర్శిగా సంపంగి ఆంజనేయులు, డేరంగుల శివ, కార్యదర్శిగా సంపంగి శివ, వల్లెపు శ్రీహరిలను నియమించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు బీవీఎన్ రాజు, ఉపాధ్యక్షులు సంపంగి శివకృష్ణ, కుంచెపు చిన్న, ట్రెజరర్ వి.వి.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయండి

నందికొట్కూరు: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనునట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి హాజరవుతారని చెప్పారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఆత్మకూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివి ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జాబివుల్లా, నాగరాజు, కాశీ, రాజేష్, రాజు, మోహన్ పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సెంట్రల్): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వెలుగోడులో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌లో అద్దె ప్రాతిపదికన దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అగ్రి ట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహిమాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 14 స్టాళ్లు, 2 షట్టర్ షాపులను నిబంధనల ప్రకారం కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. డ్వాక్రా/ఎస్‌హెచ్‌జీ /గృహమిత్ర సంఘాలలో సభ్యులుగా ఉండి, ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులకు ఈనెల 15 వరకు గడువు ఉన్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు వెలుగోడు రైతు బజారు కార్యాలయంలో ఉదయం 10 నుంచి 5 గంటల మధ్య సంప్రదించవచ్చన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

నందికొట్కూరు: ఎమ్మెల్యే జయసూర్యపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యేకు అడ్డు తగులుతూ తెలుగు దేశం పార్టీకి చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అవినీతి పరుడు అంటూ పెద్ద ఎత్తున్న ప్రకటనలు, ప్రసంగాలు ఇచ్చినా బైరెడ్డి రాజశేఖరరెడ్డి అయనను టీడీపీలోకి ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు తెలియని, నైతిక విలువలేని వ్యక్తి బైరెడ్డేనని మండిపడ్డారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరవాడ వెంకటస్వామి దళిత ఎమ్మెల్యేకు మద్దతుగా నిలవకుండా బైరెడ్డికి మద్దతుగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. బీసీలమంతా ఎమ్మెల్యేకు అండగా ఉంటామని చెప్పారు. నాయకులు చాంద్‌బాషా, విజయకుమార్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, నాయకులు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: రైతులకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఏపీ రైతు సంఘం కార్యాలయం ఆవరణలో నియోజకవర్గస్థాయి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు రైతు భరోసా తరహాలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి రైతు ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటకు పెట్టుబడులకు అన్నదాత సుఖీభవ పథకం అందించాలని కోరారు. పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంత వరకు రైతు బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేయలేదని గుర్తు చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు గోపాల్, నాగశేషులు, తిరుపాలు, మద్దిలేటి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలి



రైతులతో ఏపీ రైతు సంఘం నాయకులు

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి వన్ ఆర్, వన్ ఎల్ తూములతో పాటు వెలుగోడు, గుంతకందాల, వేంపెంట, గుండాలనట్టు, బానకచర్ల గ్రామాల మెట్ట భూములకు సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రైతులతో ఏపీ రైతు సంఘం నాయకులు సమావేశమై.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. రిజర్వాయర్ నుంచి నిప్పుల వాగుకు ఇరువైపులా రివీట్ మెంట్ నిర్మించి ప్రతి సంవత్సరం మునకకు గురవుతున్న పంటలను కాపాడాలన్నారు. అధికారులు ఈ సంవత్సరమైనా ముందుచూపుతో రిజర్వాయర్‌ను నింపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ. 20వేలు రైతుల అకౌంట్‌లో వేస్తామని ప్రకటించారని, వాటిని ప్రభుత్వం వెంటనే జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.వీరన్న, వెలుగోడు రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఎల్లాల కష్టుడు, వెలుగోడు రైతు సంఘం అధ్యక్షుడు ఎస్. రమణ, మాజీ అధ్యక్షుడు గోవిందు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మహానంది: బుక్కాపురం, గోపవరం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. శిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన లక్ష్మయ్య బైక్‌పై వెళ్తుండగా గోపవరం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. దీంతో లక్ష్మయ్యకు తీవ్రగాయాలై కాలువిరిగింది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ రామకృష్ణ, రోడ్‌సేఫ్టీ డ్రైవర్ రసూల్ ఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మయ్యను చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. మహానంది నుంచి నంద్యాల వెళ్లే మార్గంలో బుక్కాపురం పెట్రోల్ బంక్ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళ్తున్న కారును వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో కార్లు దెబ్బతిన్నాయి. రంగారెడ్డి జిల్లాకు చెందిన చంద్రనాయక్, కుటుంబ సభ్యులు తిరుపతి నుంచి మహానందికి వచ్చి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఇదిలా ఉండగా మహానంది–నంద్యాల మార్గంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు వాటిని తొలగించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మహానందిలో కలిసిన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

మహానంది: పదమూడేళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకచోట చేరి ఒకేసారి మహానందీశ్వరస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించుకున్నారు. మహానంది మండలం గోపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో 2010–11 ఏడాదిలో పది చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మహానందిలో కలిశారు. అందరూ కలిసి మాటామంతీ కలుపుకుని కుటుంబ సభ్యుల యోగక్షేమాలు, పెళ్లి, చదువులు, ఉద్యోగాల గురించి చర్చించుకున్నారు. అందరూ వెళ్లి మహానంది ఆలయంలో పూజలు నిర్వహించారు. దస్తగిరి, నాగమల్లేశ్వరి, సురేష్, రామయ్య, శిరీష, సునీల్, ఉపాధ్యాయురాలు ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.